www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 మార్చి 2024
5
పశ్చిమ గోదావరి



తాగునీటి ఎద్దటి లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వేసవికాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం తాగునీటి సరఫరా కోసం కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై సంబంధిత శాఖల అధికారులతో జెసి సివి.ప్రవీణ్ ఆదిత్యతో కలిసి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. కాలువలు కట్టేసే లోపు అన్ని తాగునీటి చెరువులను పూర్తిగా నింపాలని ఆదేశించారు. జిల్లా శివారు ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి నీటి సరఫరా చేయాలన్నారు. జల జీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఇఇ దక్షిణామూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ బిఇ నాగేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సీట్లు ఇవ్వం.. ఓట్లు వేయండి..!

మహిళా సాధికారితపై తెగ ఉపన్యాసాలు దంచేసే టిడిపి, వైసిపి ఎన్నికల సీట్ల కేటాయింపులో మాత్రం మహిళల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించాయి. టిడిపి, జనసేన అత్యంత దారుణంగా వ్యవహరించగా, వైసిపి మాత్రం మహిళలకు ఒక్క సీటు ఇచ్చి మమ అనిపించింది. రెండు జిల్లాలో అత్యధికంగా మహిళా ఓటర్లే ఉన్నారు. అయినప్పటికీ మహిళలకు సీట్లు లేకుండా పోయిన పరిస్థితి నెలకొంది.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై ఊదరగొట్టే పార్టీలు అసెంబ్లీ, లోక్‌సభ సీట్ల కేటాయింపులపై సమాధానం చెప్పాలన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



- మహిళ పట్ల టిడిపి, వైసిపి, జనసేన వివక్ష
- రెండు జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు లోకసభ స్థానాలు
- మహిళలకు ఒక్క ఎంఎల్‌ఎ, ఎంపీ సీటు కేటాయించని టిడిపి
- వైసిపి మాత్రం ఒక ఎంఎల్‌ఎ, ఒక ఎంపీ సీటుతో మమ
- రెండు జిల్లాలో అత్యధిక ఓటర్లు మహిళలే
- దాదాపు 30 లక్షల మంది ఓటర్లలో 16 లక్షకుపైగా మహిళా ఓట్లే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాటకు ముందు.. మాటకు వెనుక మా అక్కచెల్లెమ్మలంటూ మాట్లాడే టిడిపి, వైసిపి అధ్యక్షులు రెండు జిల్లాలోని అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అత్యంత దారుణంగా వ్యవహరించిన పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. పొత్తులో భాగంగా టిడిపి అభ్యర్థులు తణుకు, ఆచంట, పాలకొల్లు, ఉండి, నూజివీడు, చింతలపూడి, దెందులూరు, ఏలూరు మొత్తం ఎనిమిది స్థానాల్లో, ఉంగుటూరు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, పోలవరం మొత్తం ఐదు స్థానాల్లో జనసేన అభ్యర్థులు, కైకలూరులో ఒక్కచోట బిజెపి అభ్యర్థి పోటీ చేస్తున్నారు. మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో పొత్తుతో కలిసి పోటీచేస్తున్న టిడిపి, జనసేన, బిజెపి ఏ ఒక్క పార్టీ నుంచి మహిళలకు ఒక్క అసెంబ్లీ సీటు కూడా కేటాయించని పరిస్థితి నెలకొంది. రెండు లోక్‌సభ స్థానాల్లో నరసాపురం నుంచి బిజెపి అభ్యర్థి, ఏలూరు నుంచి టిడిపి అభ్యర్థి పోటీ చేస్తున్నారు. లోకసభ స్థానాల్లోనూ మహిళలకు ఎటువంటి సీటూ కేటాయించలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా టిడిపి మహిళ పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించిన పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసిపి మాత్రం ఒక్కో సీటుతో మమ అనిపించిన పరిస్థితి. 14 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి పోలవరం టిక్కెట్ తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మికి కేటాయించగా, నరసాపురం లోకసభ స్థానంలో గూడూరి ఉమాబాలకు కేటాయించింది. లోకసభ స్థానాల్లో రెండింటిలో ఒకటి మహిళకు వైసిపి కేటాయించడం కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అసెంబ్లీ సీట్ల విషయంలో మాత్రం వివక్ష నెలకొంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల ప్రాతిపదికన చూసిన రెండు జిల్లాలో నాలుగు నుంచి ఐదు స్థానాలు కేటాయించాల్సి ఉంది. ఎక్కడా అది అమలు కాలేదు. ఏలూరు జిల్లాలో మొత్తం 16,25,655 మంది ఓటర్లు ఉండగా అందులో 8,31,701 మంది అత్యధికంగా మహిళా ఓటర్లే ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14,58,832 మంది ఓటర్లకుగాను, 7,44,303 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రెండు జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్న పరిస్థితి. సీట్ల కేటాయింపులో మాత్రం మహిళలు పూర్తిగా విస్మరించిన పరిస్థితి నెలకొంది. మహిళలకు ఉచిత ప్రయాణం, డ్వాక్రా రుణమాఫీ అంటూ హామీలు గుప్పించి ఓట్లు దండుకునేందుకు చూస్తున్న ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపిలు చట్టసభల్లో మాత్రం మహిళలకు అవకాశం ఇచ్చేందుకు ముందుకు రాని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. మహిళా ఎంఎల్‌ఎలు లేకపోతే భవిష్యత్తులో జిల్లా పరిషత్, జిల్లా సమీక్షా సమావేశాల్లో మహిళల తరపున గొంతు వినిపించే అవకాశం లేకుండా పోనుంది. మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే ప్రధాన పార్టీలు భావిస్తూ ఒకటి, రెండు ఉచిత పథకాలు ప్రకటించి ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయి. ఎంఎల్‌ఎ అభ్యర్థిగా అవకాశం ఇచ్చిన చోట సైతం భర్తలే పెత్తనం చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. టిడిపి, వైసిపిలు మహిళల గురించి చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకూ ఏ మాత్రమూ సంబంధం లేకుండా పోయింది. మహిళలు ఒక్కసారి తమశక్తిని చూపిస్తే ఇలాంటి పార్టీలకు జ్ఞానోదయం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

టార్గెట్.. 85 ఏళ్లు..!



- రెండు జిల్లాలో దాదాపు 16 వేల మంది ఓటర్లు
- వీరికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాసం
- 60 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరమని అధికారుల ప్రణాళిక
- వారి ఓట్ల కోసం రాజకీయ పార్టీలు విశ్వ ప్రయత్నాలు
- పథకాలు నిలిపేస్తామంటూ అధికార పార్టీ బెదిరింపులు
- దృష్టి సారించని జిల్లా ఎన్నికల అధికారులు
- ఆందోళనలో వృద్ధులు వికలాంగులు

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు రాజకీయ పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. పట్టణ, గ్రామాల్లో ఓటర్ల కోసం జల్లెడ పడుతున్నారు. ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి దగ్గర నుంచే వినియోగించే అవకాసం 85 ఏళ్ల నిండిన వృద్ధులు, వికలాంగులకు ఎన్నికల సంఘం కల్పించడంతో వారిని రాజకీయ పార్టీలు టార్గెట్ చేశాయి. ఓటు తమ పార్టీకే వేయాలని కోరడంతో పాటు బేరసారాలు చేయడమే గాక ఓటు వేయకపోతే పథకాలు నిలిపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అయితే దీనిపై ఎన్నికల అధికారులు కనీసం దృష్టి సారించకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వయసు పైబడిన వృద్ధులు వికలాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సార్వత్రిక సమరంలో వజ్రాయుధం వంటి ఓటు హక్కును వినియోగించాలన్నది అందరి ఆకాంక్ష. కానీ వయసు మీరి.. శరీరం సహకరించక.. శారీరక వైకల్యంతో పోలింగ్ కేంద్రం వరకూ వెళ్లలేక బాధపడుతూ చాలా మంది దీన్ని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. తాజా ఎన్నికల్లో వీరందరికీ ఎన్నికల సంఘం ఓ ఉపయుక్త కబురు చెప్పింది. 85 ఏళ్ల వయసు దాటిన ఓటర్లకు, గుర్తింపు పొందిన వికలాంగులకు, కోవిడ్ సోకి వైద్యం పొందుతున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఎన్నికల అధికారులకు వీరు దరఖాస్తు చేసుకుంటే అర్హులా, కాదా..? అనేది ఆర్ఒ విచారణ జరిపిన అనంతరం ఓటు హక్కు కల్పిస్తారు. జిల్లాలో పురుష ఓటర్లు 7,16,955 మంది, మహిళా ఓటర్లు 7,44,308 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 74 మంది, 85 ఏళ్ల దాటిన వృద్ధులు, వికలాంగులు కలిపి 7,500 మంది ఉన్నారు. ఏలూరు జిల్లాలో 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 8,488 మంది ఉన్నారు. రెండు జిల్లాల్లో వీరు 15,988 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓటర్లతో పాటు 41 శాఖల ఉద్యోగులకు, మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 60 వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరం కానున్నాయని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా వయసు పైబడిన వృద్ధులకు వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి దగ్గర నుంచే ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వారిని టార్గెట్ చేశాయి. ఏదో విధంగా ఓటు రాబట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. పూర్వ ఎన్నికల్లో కొన్నిచోట్ల పోస్టల్ బ్యాలెట్లు నయానా భయానో వేయించు కునే పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ సారి అధికార రాజకీయ పార్టీలు ఇంటింటికీ వెళ్లి తమకే ఓటు వేయాలని హుకుం జారీ చేస్తున్న పరిస్థితి ఉంది.

వాలంటీర్లతో బెదిరింపులు..

ఎన్నికల విధుల్లో వాలంటీర్లను ఉపయోగించకూడదని ఎన్నికల సంఘం హెచ్చరికలు చారీ చేసినప్పటికీ కొందరు లెక్కజేయని పరిస్థితి. నేరుగా ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన జిల్లాలో 13 మంది వాలంటీర్లు సైతం విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయినా వాలంటీర్లు లెక్క చేయడం లేదు. స్థానిక వాలంటీర్లు, నాయకులు కలిసి పింఛను తీసుకుంటున్న వృద్ధులు, వికలాంగుల ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. గుర్తింపు కార్డు, పింఛను పుస్తకం జిరాక్సు తీసుకుంటున్నారు. వైసిపికి ఓటు వేస్తేనే పింఛను వస్తుందని చెబుతున్నారు. పోలింగ్ ప్రక్రియపై అవగాహనలేని కొందరు ఇది నిజమేనేమో అని నమ్ముతున్నారు. ఓటు వేయకపోతే పథకాలు నిలుపుదల చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. పింఛను డబ్బులు ఇవ్వొద్దంటూ వాలంటీర్లను ఆదేశిస్తున్నట్లు తెలిసింది. పింఛను రావాలంటే స్థానిక వైసిపి నాయకులను కలవాలంటూ సూచించి ఆయన వద్దకు పంపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే వైసిపి ప్రభుత్వం వస్తే ఇంటికి పింఛను వస్తుందని, వేరే పార్టీ వస్తే రద్దు చేస్తారని వారిని మభ్య పెడుతున్నారు. అయితే ఇంత జరుగుతున్నా ఎన్నికల అధికారులు ఆ వైపు దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే వచ్చే నెలలో వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు వీరే అందిస్తున్న తరుణంలో పోస్టల్ బ్యాలెట్ దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్న ఆందోళన వినిపిస్తోంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగంపై స్పష్టత కరువు

85 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కనిపించినప్పటికీ ఓటు వినియోగంపై ఇప్పటివరకూ కనీసం స్పష్టత ఇవ్వలేదు. పోస్టల్ బ్యాలెట్ ఓటు ఎన్నికల రోజు అధికారులు వెళ్లి వేయిస్తారా లేక ముందుగానే వేయిస్తారా అనేది స్పష్టత లేదు. వాస్తవానికి పోస్టల్ బ్యాలెట్ ఓటు ఉద్యోగులు పోలింగ్‌కు ముందే వినియోగించుకుంటారు. ఈ విధంగా వృద్ధులు, వికలాంగుల చేత ముందే పోస్టల్ బ్యాలెట్ పత్రాలు ఇచ్చి ఓటు వేయిస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది. దీనిపై కూడా ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. అయితే రాజకీయ పార్టీలకు తెలియకుండా ఎన్నికల అధికారులు వయసు పైబడిన వికలాంగుల వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అయితే ఎప్పుడు వేయిస్తారో ఎలా వేయిస్తారా అనేదానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు.

బిజెపి అభ్యర్థి మాకొద్దు..!

- నరసాపురం ఎంపీ అభ్యర్థిత్వంపై టిడిపి,జనసేన ఎంఎల్‌ఎలు తిరుగుబాటు?
- మాజీ మంత్రి పితానితో ఎంఎల్‌ఎ అభ్యర్థులంతా అంతర్గత సమావేశం
- రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇవ్వాలంటూ పట్టు
- చంద్రబాబుతో ఫోన్లో పితాని మాట్లాడినట్లు సమాచారం
- మరోసారి పరిశీలిస్తామని చెప్పినట్లు ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నరసాపురం లోకసభ బిజెపి అభ్యర్థి తమకొద్దంటూ ఆ పార్లమెంట్ పరిధిలోని టిడిపి, జనసేన అభ్యర్థులంతా తిరుగుబాటుకు దిగారా.. ఎంపీ రఘు రామకృష్ణంరాజుకు ఎంపీ సీటు ఇవ్వాలని టిడిపి అధిష్టానానికి తేల్చిచెప్పారా.. బిజెపి అభ్యర్థి బరిలో ఉంటే తీవ్ర ఇబ్బందులు తప్పవని చంద్రబాబును హెచ్చరించారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. నరసాపురంలో లోకసభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని టిడిపి, జనసేన అభ్యర్థులంతా మంగళవారం మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణతో అంతర్గతంగా సమావేశమైనట్లు సమాచారం. ఈ సమావేశం అత్యంత గోప్యంగా సాగినట్లు తెలుస్తోంది. కనుమూరి రఘు రామకృష్ణంరాజును కాకుండా బిజెపి అధిష్టానం నరసాపురం ఎంపీ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మను ప్రకటించింది. దీంతో క్షత్రియ సామాజిక తరగతిలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రఘు రామకృష్ణంరాజు అయితే ఆర్థికంగా ఎంఎల్‌ఎ అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలబడటంతోపాటు, సానుకూల పరిస్థితులు ఉంటాయని అభ్యర్థులంతా భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇచ్చేవిధంగా టిడిపి అధిష్టానంపై ఒత్తిడి పెంచాలని భావించినట్లు సమాచారం. సమావేశం జరుగుతుండగానే మాజీ మంత్రి పితాని చంద్రబాబుతో ఇదే అంశంపై ఫోన్లో మాట్లాడినట్లు తెలిసింది. పొత్తులో బిజెపికి కేటాయించామని చంద్రబాబు చెప్పగా, రఘు రామకృష్ణంరాజుకు టిక్కెట్ ఇవ్వకపోతే ఇబ్బందులు ఏర్పడతాయని పితాని వివరించినట్లు తెలుస్తోంది. మరోసారి మూడు పార్టీల నేతలు సమావేశమై చర్చిస్తామని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. ఎంఎల్‌ఎ అభ్యర్థులకు బిజెపి లోక్‌సభ అభ్యర్థి ఎటువంటి ఆర్థికసాయం చేయనని చెప్పడం కారణంగానే అభ్యర్థులంతా తిరుబాటుకు దిగారని తెలుస్తోంది.

టిడిపి తీరుపై చర్చ

టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా నరసాపురం లోకసభ స్థానాన్ని బిజెపి దక్కించుకుంది. 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి నరసాపురం ఎంపీగా రఘు రామకృష్ణంరాజు గెలిచినప్పటికీ ఆయన టిడిపి, బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తూ, సొంత పార్టీ వైసిపిపై తీవ్ర విమర్శలు గుప్పించిన పరిస్థితి నెలకొంది. 2024 ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా తానే పోటీ చేస్తానంటూ అనేక సార్లు ఆయనే స్వయంగా ప్రకటించిన పరిస్థితి నెలకొంది. టిడిపి లేక బిజెపి నుంచి రఘు రామకృష్ణంరాజు పోటీచేస్తారని అంతా భావించారు. బిజెపికి టిక్కెట్ కేటాయించడంతో ఆ పార్టీ నుంచి ఆయన పోటీచేస్తారని అంతా అనుకున్నారు. కానీ బిజెపి శ్రీనివాసవర్మకు టిక్కెట్ కేటాయించింది. దీంతో రఘురామకృష్ణంరాజు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విజయనగరం లోకసభ, ఉండి ఎంఎల్‌ఎ టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని మరో ప్రచారం సాగుతోంది. ఈ తరుణంలో బిజెపి లోకసభ అభ్యర్థి తమకొద్దంటూ టిడిపి, జనసేన అభ్యర్థులు తిరుబాటు చేయడం జిల్లా రాజకీయల్లో పెనుసంచలనంగా మారింది. రఘురామకృష్ణంరాజు పట్ల టిడిపి వ్యవహారశైలి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికీ రఘు రామకృష్ణంరాజు ఏపార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

కుముదవల్లిలో రూ.పది లక్షలు స్వాధీనం

ఆధారాల్లేకుండా తరలిస్తున్న ఓ కంపెనీ ఉద్యోగి

ప్రజాశక్తి - పాలకోడేరు

కుముదవల్లి రైల్వే గేట్ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో కుముదవల్లిలోని ఒక కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగి వాసుదేవరావు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ సమయంలో అతని వాహనం ఆపి తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో ఆధారం లేకుండా ఉన్న రూ.పది లక్షల స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని పాలకోడేరు మండలం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జి రామాంజనేయులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఎస్‌ఐ మోహన్‌రావు, కానిస్టేబుల్ ప్రసాద్ ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల కమాండ్ కంట్రోల్ సిబ్బందితో ఆయన సమావేశమై దిశానిర్దేశం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు, అక్రమాలపై వీలైనంత వేగంగా, సాక్షాధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు ప్రజలకిచ్చిన గొప్ప అవకాశం సి-విజిల్ మొబైల్ యాప్ అని చెప్పారు. ఓటర్లకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 1950 అని తెలిపారు. ఓటర్లు నేరుగా ఫోన్ చేసి తమ సమస్యలను తెలియ జేయవచ్చుని చెప్పారు. జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటయ్యిందని తెలిపారు. 08816-299616, 08816-299617, 08816-299618 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు.



జియో ట్యాగింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఎన్నికల నిర్వహణ

ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఎన్నికలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ ఎంసిఎంసి ఎఫ్ఎస్‌టి వాహనాల జియో ట్రాకింగ్ విభాగాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణకు 19 వాహనాలను ఏర్పాటు చేసి వాటి కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు కలెక్టరేట్ ఎంసిఎంసి కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన సిస్టంకు అనుసంధానం చేసినట్లు తెలిపారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - పాలకొల్లు

వ్యవసాయ రంగంలో పని దినాలు, అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం పాలకొల్లు ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లా డెల్టా ప్రాంతం కావడం వల్ల దాళ్వా కోతలు వచ్చేవరకూ ఎటువంటి పనులు ఉండవని, పంట కాలువలు, మురుగు కాల్వల పనులు కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పని ప్రాంతంలో వడగాల్పులకు, అస్వస్థకు గురై ప్రాణం కోల్పోయినవారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించే చర్యలు చేపట్టాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రానున్న బడ్జెట్‌లో వేతనాలు పెంచే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బి.చినవీరభద్రరావు, యడ్ల చిట్టిబాబు, ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు, శేషపు ఆశ్రీయ్య, జె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి : జెసి

ప్రజాశక్తి - ఉండి

ఇంటింటి ప్రచారానికి, సభలు, సమావేశాలకు, తదితర వాటికి ముందస్తు అనుమతి తప్పనిసరి జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్‌ఆదిత్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 48 గంటల ముందుగా సువిధ యాప్ ద్వారా లేదా నేరుగా దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని తెలిపారు.

ఆచంట :ఎన్నికల ప్రచారం, రోడ్డు షోలు, సభలు, సమావేశాలకు 48 గంటల ముందు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఒకే గ్రామంలో ఒకే సమయంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ పార్టీలు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే ముందుగా దరఖాస్తు చేసిన వారికి అనుమతి మంజూరు చేస్తామన్నారు. ప్రార్థన మందిరాలు, విద్యాసంస్థల వద్ద ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. అభ్యర్థులు అనుమతికి లోబడే కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ పార్టీ అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు.



కవాతు చేస్తున్న పోలీసులు

పాలకొల్లులో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి తమ వంతు సహకారం అందిస్తామని, ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చని పట్టణ సిఐ మంగాదేవి అన్నారు. పట్టణంలో సిఆర్‌పిఎఫ్ దళాలు మంగళవారం కవాతు నిర్వహించారు. పట్టణంలోని పలు ముఖ్యమైన వార్డులు, ప్రధాన రోడ్లలో ఈ కవాతు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ మంగాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాదం శ్రీనివాస్, ఎఎస్ఐ మారిలింగం పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆర్‌డిఒ కె.చెన్నయ్య తెలిపారు. మండలంలోని ధాన్యం కొనుగోలు సిబ్బందికి సివిల్ సప్లై అధికారులు ఒకరోజు శిక్షణా తరగతులను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడారు. మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు.

ప్రతి విద్యార్థినీ ఉన్నత స్థానాలకు ఎదగాలి

జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ సుమలత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదగాలని కాకినాడ జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత సూచిం చారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని నేచర్ వేల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ సహకారంతో సాంకేతికత, మహిళా సాధికారత అంశంపై మంగళవారం సాయంత్రం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుమలత హాజరై మాట్లాడారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు కావాలి

మిజోరం రాష్ట్ర గవర్నర్ హరిబాబు

ఘనంగా ఎస్ఆర్‌కెఆర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంజినీరింగ్ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు కావాలని మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల 44వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి హరిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిఆర్‌డిఎ వంటి సంస్థల్లో జరుగుతున్న పరిశోధనలు కూడా విద్యార్థులు పరిశీలించి వాటి నుంచి ఆ రంగంలో నైపుణ్యం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఎఐసిటిఇ ఐడియా ల్యాబ్స్ సందర్శించి అక్కడ పరిశోధకులతో మాట్లాడుతూ చేసిన పరిశోధనలు మార్కెట్లోకి ఎన్ని వస్తున్నాయన్న అంశాన్ని కూడా గమనించాలన్నారు. కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు, సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాల 1980లో ప్రారంభించి 44 సంవత్సరాల్లో దేశంలోని అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థగా అభివృద్ధి చెందిందన్నారు. హరిబాబు చేతుల మీదుగా కళాశాల వ్యవస్థాపకులు కీర్తిశేషులు సాగి రామకృష్ణంరాజు పేరిట పోస్టల్ ప్రత్యేక కవర్ విడుదల చేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందించారు. పాలకవర్గ సభ్యులు గవర్నర్ హరిబాబును సన్మానించారు.

తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సెలింగ్


ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఇటీవల బాలలపై ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయని, చట్టాలపై అవగాహన కల్పించేందుకు తల్లిదండ్రులకు సిఐ రజిని మంగళవారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షేక్ సుభాని సిబ్బంది పాల్గొన్నారు.

తీరప్రాంత అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నరసాపురం

తీరప్రాంత అభివృద్ధికి వైసిపి ఎంతో కృషి చేసిందని చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో ప్రసాదరాజు పాల్గొన్నారు. ప్రచారంలో ప్రసాదరాజు కుమారుడు ముదునూరి కృష్ణంరాజు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రసాదరాజు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరసాపురం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వంలో నేరుగా ఇంటికి పెన్షన్, రేషన్ బియ్యం పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమాని నాగరాజు, దొంగ మురళీకృష్ణ, కొల్లాటి నాగరాజు పాల్గొన్నారు.


వివాహ వేడుకలో శ్రీనివాసరావు

రాజకుమర్ కుమారుడి ఆదర్శ వివాహం

హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ దిగ్గుపాటి రాజగోపాల్ కుమారుడు డాక్టర్ జితేంద్ర, డాక్టర్ స్వాతి వివాహ వేడుక స్థానిక శ్రీ రామచంద్ర గార్డెన్‌లో మంగళవారం ఆదర్శంగా జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరై వధూవరులను దీవించారు. వివాహ వేడుక ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు సారథ్యంలో జరిగింది.

'సంక్షేమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రామంలో పార్టీ శ్రేణులతో ఆయన మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ కైగాల శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పేదలను ఆదుకోవడంలో కలిగే ఆనందం వెలకట్టలేదని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. సిర్రా నిఖిత అనే ఒక పేద విద్యార్థిని తన పరీక్ష ఫీజు కట్టుకునేందుకు డబ్బు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న భవానీప్రసాద్ మానవతా దృక్పథంతో స్పందించారు. మంగళవారం రూ.5 వేలు తమ పాఠశాల విద్యార్థుల చేతులమీదుగా నిఖితకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తనకు చేతనైన సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ అన్నారు. మండలంలోని చింతపర్రులో గోపీ ఆయన కుమారుడు సాయిబాలాజీ మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియ నిమిత్తం మంగళవారం నామినేషన్ ప్రక్రియ ముగిసినట్లు ఎన్నికల అధికారులు పీతల సుధాకరరావు, పుట్ట వేణుగోపాలచౌదరి, మరపట్ల అజయ్, గుత్తికొండ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష స్థానానికి ఐదుగురు, ఉపాధ్యక్షుని పదవికి ముగ్గురు, ప్రధాన కార్యదర్శి స్థానానికి ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కోశాధికారి పదవికి ఇద్దరు, గ్రంథాలయ కార్యదర్శికి ఒకరు, సహాయ కార్యదర్శికి ఒకరు కార్యనిర్వహక సభ్యులుగా తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ బుధవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని, అదే రోజు సాయంత్రం జరిగే సమావేశంలో ఎన్నికైన అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. మంగళవారం జరిగిన బయోలాజికల్ సైన్స్ పరీక్షకు మండలంలోని తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1765 మంది విద్యార్థులకు 1724 మంది హాజరవ్వగా 41 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఇఒ యు.శామ్యూల్‌జాన్ తెలిపారు. బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 921 మంది విద్యార్థులకు 865 మంది హాజరయ్యారని, 56 మంది గైర్హాజరయ్యారని ఎంఇఒ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షకు 57 మంది విద్యార్థులకు 38 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఉండి : మండలంలో పరీక్షకు 806 మంది విద్యార్థులకు 703 మంది హాజరయ్యారని, 103 గైర్హాజరయ్యారని ఎంఇఒ జ్యోతి తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేశారు. మండల కేంద్రం మొగల్తూరు రామన్నపాలెం,జాతీయ రహదారులపై నగదు అక్రమ రవాణా నివారణ చర్యలలో భాగంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో టీం లీడర్ ఎం శాంతి మౌనిక, ఏ ఎస్ ఐ యు రాజేంద్ర పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం

ఆకివీడు : హెచ్‌ఐవితో బాధపడే వారు సరైన విధానంలో మానకుండా మందులు వాడితే సాధారణ జీవితాన్ని పూర్తిస్థాయిలో గడపొచ్చని డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక పేరూరు వెంకటేశ్వర్లు లయన్స్ హాలులో హెచ్‌ఐవితో బాధపడే 17 ఏళ్ల లోపు పిల్లలకు ఆకివీడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు వివి.కృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా మాజీ గవర్నర్ సూర్యనారాయణరాజు మాట్లాడారు.

ఆకివీడులో ఎన్నికల పరిశీలకులు పర్యటన

ఆకివీడు : మండలంలోని కొల్లేటి తీర గ్రామాల్లో ఎన్నికల పరిశీలకులు మంగళవారం పర్యటించారు. మండల పరిపాలనాధికారి శ్రీకర్ నాయకత్వంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు పర్యటించారు. పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, అప్పారావుపేట, ప్రాంతాల్లో తనిఖీలు చేశారు.

'వాలంటీర్లపై విమర్శలు దారుణం'

ఆచంట : సంక్షేమాన్ని పేదలకు పారదర్శకంగా అందించిన వాలంటీర్లపై టిడిపి కూటమి నాయకులు విమర్శలు చేయడం బాధాకరమని ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అభ్యర్థి బొజ్జల సుధీర్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

సిఎం జగన్‌తోనే అభివృద్ధి సంక్షేమం సాధ్య పడుతుందని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని శేషమ్మచెరువు గ్రామంలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఆచంట నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి జగన్ 98 శాతం హామీలను అమలు చేశారన్నారు. అవినీతికి తావులేని పాలన అందించిన జగన్‌కు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జక్కంశెట్టి శ్రీరాములు, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, గణేశుల శేషవాణి సుబ్బారావు, మామిడిశెట్టి కృష్ణవేణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొవ్వలి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, ఎన్ఆర్ఐ, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజారామ్మోహన్‌నాయుడు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులయ్యారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు.

ఏప్రిల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి - ఆచంట

ఏప్రిల్ మొదటి వారం నుంచి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ధాన్యం సేకరణపై అవగాహనా సదస్సు, శిక్షణ కార్యక్రమం తహశీల్దార్ ఐపి.శెట్టి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తేమ 17 శాతం మించకుండా రైతులు కోతలు పూర్తయిన వెంటనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తరలించుకోవాలని సూచించారు.

నేడు వేలంపాట

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపాలిటీ పరిధిలోని 2024-25 ఆర్థిక సంవత్సరానికి రోడ్డు మార్గం వద్ద రోజువారి మార్కెట్ కాయగూరలు, పండ్లకు పన్నులు వసూలు చేసుకునేందుకు వేలంపాట 27తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

గణపవరం : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానికులు ఉపయోగించుకుని ఉచిత వైద్యాన్ని పొందాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. వల్లూరులో మంగళ వారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శిబిరంలో కంటి పరీక్షలు, షుగర్, బిపి దీర్ఘకాలిక వ్యాధులకు, ఎముకలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్య శిబిరంలో 282 మందికి ఉచితంగా వైద్యం అందించినట్లు డాక్టర్ కిరణ్మయి చెప్పారు.